teluguislam.net



# 3. ఈదుల్ అజ్‌హా ఆదేశాలు

الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَالصَّابِرِينَ عَلَىٰ مَا أَصَابَهُمْ وَالْمُقِيمِي
الصَّلَاةِ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ۝

**(వారి లోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చిపడినా వారు ఓర్పు వహిస్తారు, నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ ఉంటారు.**

***(అల్ హజ్ 22 : 35)***

**మహాశయులారా!**

ఈదుల్ అజ్‌హా ఆదేశాలు అనే అంశంపై నేటి జుమా ప్రసంగం. ఈదుల్ అజ్‌హా ముస్లింల గొప్ప చారిత్రక పండుగ. నాలుగు వేల సంవత్సరాల క్రితం ఒక మహత్తర ఖుర్బానీ (త్యాగం) తో సంబంధం గల పండుగ ఇది. ఈ పండుగ దైవ ప్రవక్త ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ (అలైహిస్సలాం) గారి సంప్రదాయం. ఆయన తన ప్రియపుత్రుడైన ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ను 'మినా' ప్రదేశంలో దైవానికి సమర్పించటానికి సిద్ధమయ్యారు. నేను ఖుత్బాయే మస్నూనలో ఆ దైవ సూక్తులనే పఠించాను. అల్లాహ్ సెలవిస్తున్నాడు:

**(వారిలోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చిపడినా వారు ఓర్పు వహిస్తారు, నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ ఉంటారు.**

***(అల్ హజ్ 22 : 35)***

**ప్రియ సోదరులారా!**

ఈ సుప్రసిద్ధ పండుగ జిల్‌హిజ్జ మాసం 10వ తేదిన జరుపబడుతుంది. ఈ మాసం ఎంతో పవిత్రమైనది, గౌరవప్రదమైనది. మొదటి తేది మొదలుకొని

10వ తేది వరకు, ఆ తరువాత తష్రీఖ్ రోజులు 11,12,13వ తేదీలు కూడా ఎంతో ప్రాముఖ్యత కలవే. ఈ పవిత్ర మాసంలోనే ముస్లింలు ఇస్లామీయ అతిముఖ్య మూలాంశమైన హజ్ విధిని నెరవేరుస్తారు. ఈ నెలలోనే ఒక హిజ్రి సంవత్సరం పూర్తవుతుంది. ఈ సుప్రసిద్ధ పండుగ ప్రత్యేకమైన మూడు పుణ్య కార్యాలతో కూడుకున్నది. మొదటిది: హజ్ చేయటం. జిల్‌హిజ్జ 8వ తేదీన హజ్ యాత్రికులు ఇహ్రామ్ ధరించి మక్కా నుండి 'మినా' ప్రాంతానికి చేరి ఆ రాత్రి అక్కడే బస చేస్తారు. ఆ ప్రదేశంలోనే ఇబ్రాహీమ్(అలై) ఖుర్బానీ సమర్పించారు. 9వ తేదీన తెల్లవారుజామున అక్కడ నుండి బయలుదేరి అరఫాత్ మైదానంలో హాజరవుతారు. జుహర్ నుండి సూర్యాస్తమయం వరకు దుఆలో నిమగ్నమై రాత్రికి 'ముజ్దలిఫా' చేరుకుంటారు. పదవ తేదీన ఉదయాన్నే మళ్ళీ 'మినా' చేరుకుని షైతాన్‌పై రాళ్ళు రువ్వుతారు. ఆ తరువాత ఖుర్బానీ సమర్పించుకుని ఇహ్రామ్ దీక్షను విరమించు కుంటారు.

ఇక రెండవ పుణ్యకార్యం ఈదుల్ అజ్‌హా రోజు ప్రపంచమంతటా అల్లాహ్ పట్ల కృతజ్ఞతాభావంతో చేయబడే రెండు రకాతుల నమాజ్ హాజ్‌తో ఉన్నవారైతే ఈ రెండు రకాతుల నమాజ్‌కు బదులుగా కేవలం షైతాన్‌పై కంకర రాళ్ళు రువ్వు తారు. వారిని మినహాయించి ప్రపంచంలోని ముస్లిలందర్లూ ఈ పర్వదినాన ఈదుల్ అజ్‌హాను ఘనంగా జరుపుకుంటారు. ఇక మూడవ పుణ్యకార్యం ఖుర్బానీ ఇవ్వటం. ఇది పదవ తేది నుండి 13వ తేది వరకు ఇవ్వబడుతుంది. పదవ తారీఖున ఇవ్వడం అత్యుత్తమం.

**ప్రియసోదరులారా!**

మళ్ళీ ఈ పవిత్రమాసాన్ని మనకు అనుగ్రహించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞలు తెలపండి. మళ్ళీ ఎవరికి ప్రాప్తమవుతుందో అల్లాహ్‌కే తెలుసు.

జిల్‌హిజ్జ పది రోజులు, ఈదుల్ అజ్హా ఘనతలను తెలుపుతూ ప్రియ ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: పుణ్యకార్యాల దృష్ట్యా ఈ పది రోజుల్లో చేసే పుణ్య కార్యాలు ఇతర పుణ్యకార్యాలకన్నా అల్లాహ్ దగ్గర అత్యంత ప్రియమైనవి. 'దైవ ప్రవక్తా! దైవ మార్గంలో పోరాడటం కూడా వీటికి సరితూగదా? అని ప్రశ్నించగా', సరితూగదు. కాకపోతే ఓ వ్యక్తి తన ధన ప్రాణాలతో దైవ మార్గంలో పోరాడటానికి వెళ్ళి ధనంతో పాటు ప్రాణత్యాగం కూడా చేసిన ఒక త్యాగధనుడు తప్ప అని సమాధానమిచ్చారు ప్రవక్త (స). **(సహీహ్ బుఖారీ)**

teluguislam.net



ఈ పది రోజుల్లో అత్యధికంగా అల్లాహ్ స్మరణ చేయాలి. తక్బీర్‌లు వీలైనంత ఎక్కువగా పఠించాలి. తక్బీర్!

الله أكبر الله أكبر لا إله إلا الله والله أكبر الله أكبر ولله الحمد

**"అల్లాహ్ అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్"**

జిల్ హిజ్జ మొదటి తారీకు నుండే తక్బీర్ పలుకటం మొదలెట్టాలి. ఇంటా-బయటా తక్బీర్‌లు పలుకుతూనే ఉండాలి. ఈద్గాహ్‌కు వెళ్తూ, ఈద్గాహ్‌లో ఉన్నంతకాలం, తిరిగి వచ్చేటప్పుడు, ఇలా మార్గం గుండా తక్బీర్‌లు పలుకుతూనే ఉండాలి. ఇక పండుగ రోజైతే ఈ తక్బీర్లను వీలైనంత ఎక్కువగా పలకాలి. జిల్‌హిజ్జా 13వ తేది అసర్ నమాజ్ వరకు పలకాలి.

ఇక ఖుర్బానీ గురించి అల్లాహ్ ఈ విధంగా ఆదేశించాడు.

الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَالصَّابِرِينَ عَلَىٰ مَا أَصَابَهُمْ وَالْمُقِيمِي الصَّلَاةِ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ

**"ఖుర్బానీ పశువులను మేము అల్లాహ్ సూచనలుగా జేసి యున్నాము. మీకు వాటిలో మేలున్నది. కాబట్టి వాటిని వరుసగా నిలబెట్టి అల్లాహ్ పేరును ఉచ్చరించండి. అవి ప్రాణం విడిచి ప్రక్కల మీద పడిపోయిన తరువాత మీరూ వాటిని తినండి, అడగని అభాగ్యులకు, అడిగే అగత్యపరులకు కూడా తినిపించడండి. ఈ విధంగా మేము వాటిని మీకు స్వాధీన పరిచాము. బహుశా మీరు కృతజ్ఞులవుతారేమోనని.** *(అల్ హజ్ 22 : 36)*

ఖుర్బానీ అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన ఆచరణ. అల్లాహ్ ఈ ఆచరణ ద్వారా మీ అంతరంగాన్ని, సంకల్పాన్ని దైవభీతిని చూడదలిచాడు. సంకల్పశుద్ధితో అల్లాహ్ ప్రసన్నత గైకొనేందుకే ఖుర్బానీ ఇవ్వాలి. అల్లాహ్ ఆదేశం ఇల్లా ఉంది:

لَن يَنَالَ اللَّهَ لُحُومُهَا وَلَا دِمَاؤُهَا وَلَٰكِن يَنَالُهُ التَّقْوَىٰ مِنكُمْ

**"వాటి మాంసం గానీ, వాటి రక్తం గానీ అల్లాహ్‌కు చేరదు. కానీ మీ భయ భక్తులే ఆయనకు చేరుతాయి.** *(అల్ హజ్ 22 : 37)*

భక్తి ప్రేమలతో అల్లాహ్ ప్రీతి కొరకు విలువైన జంతువును ఖుర్బానీ చేసినట్లే

సమయం వచ్చినపుడు తాను కూడా అల్లాహ్ ప్రీతి కొరకు తన ప్రాణాలను సైతం అర్పిస్తాను అనే సంకల్పశుద్ధితో, కృత నిశ్చయముతో ఖుర్బానీ చేయాలి. అల్లాహ్‌కు ఇదే ప్రియమైనది. అంతేగాని అల్లాహ్‌కు వాటి రక్తమాంసాలు ప్రియమైనవి కావు.

ఖుర్బానీలో ఒంటె, ఆవు, మేక, గొర్రెలను సమర్పించుకోవచ్చు. ఖుర్బానీ పశువులన్నీ అల్లాహ్ చిహ్నాలు. వాటిని భయభక్తులతో జిబహ్ చేయాలి. జంతువుని ఖిబ్లా దిశలో ఉంచి **بسم الله الله اكبر** **"బిస్మిల్లాహి అల్లాహు అక్బర్"** అని జిబహ్ చేయాలి. పదునైన కత్తితో స్వయంగా జంతువును జిబహ్ చేయుటం ఉత్తమం.

ఖుర్బానీ జంతువుల చర్మాన్ని, మాంసాన్ని అమ్మకూడదు. కూలి ఖర్చులు కూడా వీటి ద్వారా చెల్లించరాదు. ఖుర్బానీ మాంసాన్ని తాము స్వయంగా తినటంతో పాటు పేదలకు, అనాధలకు, అభాగ్యజీవులకు పంచిపెట్టాలి. వారు కూడా ఈద్ సంతోషాలలో పాల్గొనేలా చేయ్యాలి.

**సోదర, సోదరీమణులారా..!**

ఏ విధంగానైతే ఈద్ పర్వదినాన్ని భయభక్తులతో జరుపుకోవటానికి ఈద్గాహ్‌లో ఒక చోట సమావేశం అవుతామో అదే విధంగా ఒక రోజు మనమందరం అల్లాహ్ సన్నిధిలో హష్ర్ మైదానంలో సమావేశం కావాలనే అక్షర సత్యాన్ని మరవ వద్దు. ఆ దినాన్ని తలచుకునేందుకే ఈద్గాహ్‌లో ముస్లింలందరూ గుమిగూడుతారు. అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో నమాజ్ చేస్తారు. క్షమాభిక్షకై వేడుకుంటారు.

నా ముస్లిం సోదర, సోదరీమణులారా! శ్రద్ధగా వినండి. నేటి ఆధునిక కాలంలో స్త్రీలు పాశ్చాత్యనాగరికతకు ఆకర్షితులై ఫ్యాషన్ల పేరుతో కొంగ్రొత్త వేషాలతో బజారుల్లో దర్శనమిస్తూ ఉంటారు. అల్లాహ్‌కు భయపడండి. తమ మాన శీలాలను కాపాడుకోండి. పరదా పద్ధతిని పాటించండి. అత్యవసర పరిస్థితుల్లోనే తప్ప ఇతర సమయంలో ఇంటి నుండి బయటకు రాకూడదు.

ఈ ఖుత్బా చివరిలో అల్లాహ్‌తో దీనంగా దుఆ చేసున్నాను. అల్లాహ్ మనందరికి సద్బుద్ధిని ప్రసాదించుగాక, మన పాపాల్ని అల్లాహ్ క్షమించుగాక!

ఓ అల్లాహ్! ప్రవక్త అడుగుజాడల్లో నడిచే భాగ్యాన్ని ప్రసాదించు, నీ కారుణ్యాన్ని సదా మాపై కురిపిస్తూ ఉండూ, ముస్లింలకు ఇహపరలోకాల్లో గౌరవాన్ని, ఉన్నత స్థానాన్ని ప్రసాదించు.

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్సమీ ఉల్ అలీమ్..**